

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 30 ఏప్రిల్ 2025


పేజీలు : 08


## సీఎం పర్యటన సందర్భంగా.. పకడ్బందీగా ఏర్పాట్లు

# పూర్తి చేయండి



- అధికారులను ఆదేశించిన కలెక్టర్, ఎస్పీ
- సీఎం పర్యటన ప్రాంతాలు పరిశీలన



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :

ఆత్మకూరులో మే 1న సీఎం పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా సమన్వయంలో (ఎఎస్ఎల్) భాగంగా సీఎం పర్యటించే ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పర్యటించారు. మంగళవారం ఉదయం ఆత్మకూరుకు విచ్చేసిన కలెక్టర్, ఎస్పీ ఆత్మకూరు బీసీ గురుకుల పాఠశాల వద్ద హెలీపాడ్, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లను, నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద పైలాన్ ఆవిష్కరణ, సభ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి, భద్రతా పరంగా తీసుకోవలసిన -మిగతా 2లో

## నేటి నుంచి జాతీయస్థాయి

# సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

- అధికారికంగా షెడ్యూల్ ప్రకటన
- విక్రమ సింహపురి యూనివర్శిటీలో అఖిల భారత
- అంతర యూనివర్శిటీల సాఫ్ట్ బాల్ టోర్నమెంట్
- ఏప్రిల్ 30 నుండి మే 3 వరకు మహిళల టోర్నీ
- నాలుగు పూల్స్‌లో మొత్తం 95 జట్లు పోటీ
- నాక్ అవుట్ దశలో మొత్తం 91 మ్యాచ్‌లు
- మొదటిరోజు సాయంత్రం 5 గం॥ ప్రారంభ వేడుక
- ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న పలువురు



వివరాలు 8లో

విక్రమ సింహపురి యూనివర్శిటీలో వర్శిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న అఖిల భారత అంతర యూనివర్శిటీల సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ షెడ్యూల్ ను అధికారులు విడుదల చేశారు.

– వెంకటాచలం, మేజర్‌న్యూస్ :

## టిడ్కో గృహాల రుణాల మంజూరును

# వేగవంతం చేయండి


**కమిషనర్ వైఓ నందన్**



వెంకటేశ్వరపురం, అల్లిపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి లేఅవుట్లలో టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు రుణాలు మంజూరు చేసి, గృహాలను కేటాయించాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. 2లో..

## దళిత మహిళపై

# దాడి



**కులం పేరుతో వేధింపులు నాయుడుపాలెంలో ఉద్రిక్తత..**

వెంకటాచలం, మేజర్‌న్యూస్ :

వెంకటాచలం మండలం నాయుడుపాలెం గ్రామంలో ఈనెల 28న దళిత మహిళపై దాడి జరిగిన సంఘటన కలకలం రేపింది. నాయుడుపాలెం ఇండసి అనిత అనే మహిళపై అదే గ్రామానికి చెందిన చల్లా హరిబాబు, చల్లా కిష్టయ్య అనే ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఈ ఇద్దరు వ్యక్తులు ఆమెతో గ్రామంలో ఉన్న బహిరంగ ప్రదేశంలో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆమెను శారీరకంగా దాడి చేసి, కులంపేరు ప్రస్తావిస్తూ అశ్లీలంగా దూషించినట్లు తెలిపింది. అంతటితో ఆగకుండా ఆమె దుస్తులను లాగుతూ నేలకేసి తోసేసినట్టు ఆరోపించారు. దీంతో బాధితురాలు మానసికంగా దెబ్బతిన్నట్టు పేర్కొంటూ.. అదేరోజు రాత్రి 8గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. కేసును స్వీకరించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాధిత మహిళకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## మిత్రున్ని పరామర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



విడవలూరు, మేజర్‌న్యూస్ :

విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలో పాతమిత్రుడు తాతా నాగేశ్వరరావును సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కలిశారు. తాతా నాగేశ్వరరావును పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీని ఓ దశలో తాతా నాగేశ్వరరావు గౌడ్ అంతా తానే వ్యవహరించారు. పార్టీ కోసం నిబద్ధతతో నిరంతరం పని చేశారు.

## ఆదాల ఆశీస్సులు అందుకున్న

# శ్రీకాంత్ రెడ్డి



నెల్లూరు, మేజర్‌న్యూస్ : జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ యూత్ అధ్యక్షులు మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి తన జన్మదినాన్ని -మిగతా 2లో

## శ్రీకామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు

# సేవా కమిటి ఏర్పాటు

ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో 12 మందితో ఏర్పడిన కమిటీ

మే 17 నుంచి 27 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు

2లో



ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా..

# చరిత్ర సృష్టించనున్న అమరావతి రాజధాని

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి
- ప్రజా రాజధాని పూర్తయితే యువతకు ఉద్యోగాలు ఉపాధి దొరుకుతాయి
- న్యాయస్థానాల జోక్యంతో అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడింది
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయని అమరావతి రాజధాని ప్రపంచంలోని తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించని ఉందని ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. 65 వేల కోట్లతో 217 స్క్వేర్ కిలోమీటర్లతో 8352 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతోందన్నారు. రాజధానిలో పున:నిర్మాణ పనులకు 48 వేల కోట్లు వ్యయంతో ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు ఉపాధి దొరుకుతాయని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వాధీనంలో ఉన్న భూమిని దశలవారీగా అమ్ముతూ.. రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించవచ్చన్నారు. తుళ్ళూరు అమరావతి తాడికొండ మంగళగిరి మండలాల పరిధిలోని మొత్తం 11 గ్రామాల్లో సుమా రు 44 వేల ఎకరాల భూములను ఫేస్ టు భూ సమీకరణలో తీసుకోవాలనేది ఆలోచన అన్నారు. జగన్మోహన్ రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయి రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువలు పడిపోయాయన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల రూ.2 లక్షల కోట్ల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు, పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని, దీంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతు తెలిపి అధికారం వచ్చాక మూడు రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చుపెట్టి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించారని మండిపడ్డారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లకు ఇచ్చిన మెటీరియల్ కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుసరులతో కలిసి దోపిడీ చేశారన్నారు. 1631 రోజులపాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారు.. ఈ సుదీర్ఘ పోరాటంలో 200 మందికి పైగా రైతులు వేధింపులు తల లేక ప్రాణాలు వదిలారన్నారు. రైతుల ప్రాణ త్యాగాలు ఓవైపు పోరాటాలు, మరోవైపు న్యాయస్థానాల చర్చించి రాజధాని అమరావతి చెక్కుచెదరకుండా అలా నిలబడిందన్నారు. చంద్రబాబు పరిపాలన దక్షిణతో ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి రానున్న రోజుల్లో పరుగులు పెట్టనుందని పేర్కొన్నారు.

# టిడ్కో గృహాల రుణాల మంజూరును వేగవంతం చేయండి

### కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వరపురం అల్లిపురం అక్కచెరువుపాడు కల్లూరు పల్లి లేఅవుట్లలో టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు రుణాల ప్రక్రియను సులభతరం చేయాలని, వారి కుటుంబ సభ్యులలో మంచి సిబిల్ స్కోర్ ఉన్న వారిని కూడా జాయింట్ చేస్తూ.. రుణాలు మంజూరు చేసి, గృహాలను కేటాయించాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. టిడ్కో గృహాల కేటాయింపుపై టిడ్కో విభాగం అధికారులు, మెప్మా విభాగం, బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కమిషనర్ నందన్ మాట్లాడుతూ.. 365 ఫీట్స్, 430 ఫీట్స్ ఇళ్ల ప్లాట్ల రుణాల మంజూరుకు మెప్మా విభాగానికి పలు సూచనలు జారీ చేశారు. జూన్ నెల 12వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న రుణాలన్నింటినీ క్లియర్ చేసి, లబ్ధిదారులకు గృహాలను అందజేయాలని ఆదేశించారు. బ్యాంకు లోన్‌కు అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరును బ్యాంకర్లు సులభతరం చేయాలని సూచించారు. రుణాల మంజూరులో తలెత్తే వివిధ సందేహాలను నివృత్తి చేసి లోన్ అందేందుకు మెప్మా విభాగం పూర్తిగా సహకరించాలని సూచించారు. లోన్ ప్రక్రియ పూర్తయే వరకు లబ్ధిదారులను, బ్యాంకర్లతో అనుసంధానించి రుణాలు మంజూరు అయ్యేలా పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ఈ మహేష్, డీఈఈ పార్ధసారథి, డీసీఓ రామ సుబ్బారావు, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగ సిబ్బంది, మెప్మా విభాగం సీఎంఎం సీఓ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రదాడి మృతులకు జనసేన సంతాప సభ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పహల్గాం అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో పాటుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి జనసేన నేతలు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, కొట్టే వేంకటేశ్వర్లు, తీగల చంద్రశేఖర్ రావు, కోలా విజయలక్ష్మి, గుండ్లూరు నాగరత్నం, ఉయ్యాల ప్రవీణ్, నలిశెట్టి శ్రీధర్, అలహరి సుధాకర్, బొబ్బేపల్లి సురేష్ నాయుడు, కే మోహన్,చప్పిడి శ్రీనివాసులు రెడ్డి తదితరులు మధుసూధన్ చిత్రపటానికి నివాళులర్పించారు.



## ఆదాల ఆశీస్సులు అందుకున్న శ్రీకాంత్ రెడ్డి

*(మొదటి పేజీ తరువాయి)*

పురస్కరించుకొని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆదాల క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడి రంగారెడ్డి.. శ్రీకాంత్ రెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ వెంకయ్య, షేక్ మొయినుద్దీన్, నాగ శ్రీనివాస్‌రెడ్డి, కొండేటి నరసింహారావు, కల్లూరు లక్ష్మీరెడ్డి, షేక్ అల్లాబక్షు, బెల్లంకొండ వెంకయ్య, నాని తదితరులు మంగ ళపూడి శ్రీకాంత్ రెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీఎం పర్యటన సందర్భంగా.. పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయండి



*(మొదటి పేజీ తరువాయి)*

జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్, ఎస్పీ పలు సూచనలు చేశారు. నెల్లూరుపాలెం గిరిజన కాలనీ వద్ద సీఎం స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసే ఇంటిని, గిరిజనకాలనీని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. మేడే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నారంపేట ఎస్ఎంఈ పార్క్ – నెల్లూరుపాలెం మధ్యలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం వద్ద భవన నిర్మాణ కార్మికులతో సీఎం మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారు. ఈ ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. సీఎం పర్యటన ప్రదేశాల్లో ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తూ.. జిల్లా కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు సహకరిస్తూ వారి సూచనల మేరకు సీఎం పర్యటన ప్రాంతాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, పరిశ్రమల శాఖ జిఎం మారుతీ ప్రసాద్, ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సేవా కమిటి ఏర్పాటు

**ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో 12 మందితో ఏర్పడిన కమిటీ**

**మే 17 నుంచి 27 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు**




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ కామా క్షితాయి అమ్మవారి ఆలయానికి నూతన సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాను న్న అమ్మవారి వార్షిక బ్రహ్మో త్సవాల నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సేవా కమిటీని ఏర్పాటు చేయా లని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. శ్రీ కామాక్షితాయి అమ్మవారి సేవా కమిటీలో తిరువూరు అశోక్ రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ తిరువాయిపతి నందకుమార్, ముంగర సుధాకర్, శశి శేఖర్ శర్మ (అర్చక), పాలూరు చాముండేశ్వరి, కొల్లపూడి శారద, పెన్నత్తూరు సుమలత, గంధ్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మి, ఇమ్మడిశెట్టి సౌజన్య లక్ష్మిలు ఎన్నికయ్యారు. వీరు మే 17 నుంచి 27 వరకు జరగనున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా సేవా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు, దేవాదాయ శాఖ మంత్రి ఆనంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ఈ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

# కథలు పిల్లల భవిష్యత్తుకు పునాది లాంటివి

## విశ్రాంత పోస్టుమాస్టర్ జనరల్ వి.రాములు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కథలు పిల్లల భవిష్యత్తుకు పునాది లాంటివని అలాంటి కథల వల్ల ప్రేరేపితులై జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకునేందుకు దోహదపడతాయని విశ్రాంత పోస్ట్ మాస్టర్ జనరల్ వి.రాములు పేర్కొన్నారు. వింజమూరు శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం రెండవ రోజు కథలు చెప్పించడం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కథలు అనేది చాలా చిన్న విషయం గానే అనిపించినా అందులో ఉన్న పరమార్ధం చాలా గొప్పగా ఉంటుందని తెలిపారు. మహారాష్ట్ర చక్రవర్తి శివాజీ తల్లి జిజియా బాయ్ చిన్నతనం నుండే శివాజీకి రామాయణ భారత భాగవత గ్రంథాలలోని కథలను చెప్పి వారిలో ఉండే ధైర్యగుణం ధర్మతత్పరత హిందూ ధర్మ పరిరక్షణ తదితర గుణాలు అలవాడే విధంగా శివాజీని తీర్చిదిద్దింది. ఇది చరిత్ర చెప్పిన పాఠాలు తెలుసుకోదగినవి కాబట్టి చిన్నతనంలో మన బామ్మలు అమ్మమ్మలు తన మనవళ్లను ఒడిలో పడుకోబెట్టుకొని నీతి కథలు చెప్పి నిద్రపుచ్చే వారని అంటే ఆ కథలలో ఉన్న మాధుర్యాన్ని నీతిని ఆ చిన్నారులు గ్రహించి వాటి ప్రభావం వయస్సు పెరిగిన తర్వాత ఏర్పడు తుందనే భావంతో ఆ విధంగా చెప్పేవారన్నారు. కాబట్టి ప్రస్తుతం విద్యార్థులు కూడా నీతి కథలను చదివేందుకు గ్రంథాలయాలను ఉపయోగించుకుని దేశభక్తిని కలిగి తమ జీవితానికి బంగరు భవిష్యత్తు కలిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను గ్రంథాలయం ద్వారా ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

# సీఎం ఆత్మకూరు పర్యటనను అడ్డుకుంటాం : ఆర్‌పీఐ




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరిచి పర్యటనలు కు రావాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు విలేకరుల సమావేశంలో ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలు అమలుపరిచి పర్యటన కార్యక్రమాలు జరుపుకోవాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.మాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీలు అమలు చేయకుండా పర్యటనలు పేరుతో ప్రజల్లో తిరగడం మీకు మొహం ఎలా చెల్లుతుందని, సూపర్ సిక్స్ పథకం అమలు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితమన్నారు కానీ ఇంతవరకు ఏ పథకం అమలు కాలేదని విమర్శించారు. పేదల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం అన్నారు. మరి కూటమి ప్రభుత్వంలో ఉండే నాయకులు సంక్షేమం కోసం ప్రజాధనాన్ని సహజ వనురులని దోచుకునే పనిలో నిమగ్నమయ్యారని, పేదలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో పేద ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఆదాయం పర్సంటేజీలు వచ్చే పనుల్లో శ్రద్ధ వహిస్తున్నారని, పేద దళితులు సమస్యలు వారికి పట్టడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాస్వామ్యంలో పర్యటనలు జరుపుకోవాలని తెలియజేశారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌పీఐ పార్టీ చంద్రబాబు నాయుడు పర్యటనలు అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుంపల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాసెసింగ్ ప్లాంట్లకు, పండ్ల తోటలకు

# తాగునీటిని వినియోగించడం అన్యాయం

- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** దాహార్తిని తీర్చే పంచాయితీ తాగునీటిని ప్రాసెసింగ్ ప్లాంట్లకు, పంటతోటలకు వినియోగించడం అన్యాయమని రాముడుపాలెం పంపు ఆపరేటర్స్ నాగరాజు, మోషేలు ఆవేదన వ్యక్తపరిచారు. మంగళవారం మండలంలోని గంగపట్నం గ్రామంలోని వెంకటేశ్వరపురం వద్ద విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదివర్తిపాలెం నుంచి రాముడుపాలెం వెళ్లే మంచినీటి పైపులైన్లను కొంతమంది అక్రమార్కులు అడ్డదారుల్లో మళ్లించి రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంటుకు, ఐదుఎకరాల మునగ తోటకువాడుతున్నారని వాపోయారు. రాముడుపాలెం గ్రామ ప్రజలకు తాగేందుకు నీళ్ల రాకపోవడంతో ఆరాతీయగా కొందరు వ్యక్తులు మార్గం మధ్యలో అడ్డగోలుగా పైపును తవ్వి తాగునీటిని తమ సొంత వ్యాపారాలు నిమిత్తం వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తెలియజేయగా వారు ఏమి పట్టించుకోకపోవడంతో మీడియా దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. ఉన్నత అధికారులు ఈ సమస్యనపై చర్యలు తీసుకొని పేద ప్రజలుకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

# ఉపాధి నిధులు దుర్వినియోగం చేసిన ఉద్యోగులపై క్రిమినల్ కేసులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలో ఉపాధి హామీ పథక పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడి నిధులు దుర్వినియోగం చేసిన, రికార్డులు సమర్పించని ఉపాధి హామీ పథక ఉద్యోగులు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడి బి.గంగాభవాని ఆదేశాలు జారీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన ఉపాధి పనులపై 17వ విడత సామాజికతనికి గత నెలలో చేపట్టారు. తనిఖీల్లో ఉద్యోగులు సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఏపీఓ, ఈసి, టీఎలతో పాటు ఎఫ్ఎలు మొత్తం 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు దుర్వినియోగం చేసిన నిధులు 47, 62,832 లక్షల రికవరీ చేయాలని ఎంపీడీవో కార్యాలయానికి ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు జారీ చేశారు. క్రిమినల్ కేసుల నమోదు విషయమై మంగళవారం ఎంపీడీవో అప్పాజీని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఉపాధి ఉద్యోగుల సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు నిధులు రికవరీకి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## ఇస్కాన్ లోపల జగన్నాథ రథయాత్ర



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో పిల్లలకు సమ్మర్ క్యాంపును రెండవ రోజు మంగళవారం ఉదయం నెల్లూరు ఇస్కాన్ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ లోపల జగన్నాథ రథయాత్ర పిల్లలతో నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవ స్వామి సూచన మేరకు క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. మంచి అలవాట్లు భక్తి భావన తోపాటు ఆధ్యాత్మిక కథలు సంకీర్తనలు భగవద్గీత రామాయణం మహాభారతం వంటి పట్నాలు గురించి పిల్లలకి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సుఖ దేవ స్వామి, ఇస్కాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుకూరును సన్మానించిన నేతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెట్టుకురు ధనుంజయ్ రెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా రెండవ సారి నియమితులైన సందర్భంగా ఆత్మకూర్ మునిసిపాలిటీ 4వ వార్డ్ నందు గల జెఆర్ పేట వినాయక స్వామి ట్రస్ట్ సభ్యులు తిరుగాబత్తిన శ్రీరాములు 4వ వార్డు అధ్యక్షుడు దాసరి మధుసూదనరావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డిని ఘనంగా సన్మానించి ఆయన భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు బిఎల్ఏ మునగాల వెంకట రమణ, జెఆర్ పేట వాసులు చింతల ఈశ్వర్ రెడ్డి, అనంతనేని రంగస్వామి, దాసరి బాలకృష్ణ, మల్లీపెద్ది రమణయ్య రిటైర్డ్ ఉపాధ్యాయలు శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దాడిలో వ్యక్తి మృతి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం నాగయ గుంట గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. పోలీ నాయుడు చెరువు గ్రామానికి చెందిన పెద్ద రఫీను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కర్రలతో, కత్తులతో దాడి చేశారు. విషయాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వ్యక్తిని బుచ్చి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసులు, సిఐ శ్రీనివాసులురెడ్డి ఎస్ఐ సంతోష్ రెడ్డి, పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెట్టుకూరును అభినందించిన కిలారి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్‌గా నియమితులైన మెట్టుకూరు ధనుంజయరెడ్డిని ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు కిలారి సుబ్రహ్మణ్యం నాయుడు మంగళవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ధనుంజయరెడ్డిని తమ స్వగృహంలో కలిసిన సుబ్రహ్మణ్యంనాయుడు శాలువా, పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించి పదవి లభించడంపట్ల శుబాకాంక్షలందజేశారు. ఈ పదవి ద్వారా జిల్లాప్రజలకు మెరుగైన సేవలందించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

# చెత్త సేకరణ వృత్తిదారుల మెరుగైన జీవనానికై చర్యలు

## కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలకసంస్థ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టలు, ఇతర నిరుపయోగ వస్తువులను సేకరించి, మార్కెట్లో విక్రయించి జీవనం సాగించే వృత్తిదారులను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ తెలియజేశారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్‌ను కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్లో మంగళవారం నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం ద్వారా గతంలో 93 మంది భూగర్భ డ్రైన్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులకు ఐదు లక్షల విలువైన ఉచిత వైద్య సేవలు పొందే ఆయుష్మాన్ కార్డులను, స్వచ్ఛత ఉద్యమి యోజన ద్వారా లోన్లు కూడా అందించామని తెలిపారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య ఇన్‌చార్జ్‌గా, శానిటేషన్ సూపర్ వైజర్ నరసింహ రావు నోడల్ అధికారిగా, 30 మంది వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల బృందం, అలాగే నవజీవన ఆర్గనైజేషన్ రిసోర్స్ ఆర్గనైజేషన్ ఆఫీసర్ సహదేవయ్య వారి బృంద సభ్యులు 50 మంది నగర కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ వృత్తిదారులను యాప్ ద్వారా గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సచివాలయాల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి విక్రయించుకునే వారి వివరాలను యాప్ ద్వారా నమోదు చేయించి, ఆ వృత్తిలో కొనసాగుతున్న వారందరితో నగరపాలక సంస్థ కార్యాలయం తో పాటు వివిధ డివిజన్లలో శిబిరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నామని వివరించారు. ఎక్కువ సంఖ్యలో వ్యర్థాలను సేకరించే వారికి ఉచిత వాహనాలను అందించి వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సేవలు అందించేలా ఆయుష్మాన్ కార్డులను అందజేస్తామని తెలిపారు. నిరుపేద ప్రజల జీవన భద్రతను మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్ సాయి కృష్ణ, నవజీవన్ ఆర్గనైజేషన్ ఆర్ఓ సహదేవయ్య శానిటేషన్ సూపర్వైజర్ నరసింహారావు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అండ్ ఈడబ్ల్యూఎస్ సహకారంతో మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికార పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం బలిజ పాలెం కేంద్రంగా గ్రామ సచివాలయం నందు ఈ శిక్షణ కార్యక్రమాన్ని అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున యాదవ్ ప్రారంభోత్సవం చేశారు. ఆయనతోపాటు ఎంపీడీవో నాగమణి, పంచాయతీ సెక్రటరీ జగదీష్, పట్టణ అధ్యక్షులు బొలిగర్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు ముఖ్యంగా, అక్కయ్య గారి ఏడుకొండలు, పి.శీనయ్య, శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జనరల్ సెక్రెటరీ నీలం మాట్లాడారు. మహిళల్లో జీవనోపాధి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత ఆశయంతో, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంకల్పంతో కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలియజేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో నాగమణి మాట్లాడారు. 90 రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. మొదటి బ్యాచ్‌లో 72 మందికి శిక్షణ కల్పిస్తున్నట్లు ఎంపీడీవో అన్నారు. శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకుని మంచి టైలర్‌గా పేరు గడించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళలకు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** లేబర్ కోర్టులను రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల 20వ తేదీన కార్మిక, కర్షక సంఘాలు చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కటారి ఆజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ, సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహిం చారు. తొలుత సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాసే దిశగా ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వాల పనితీరుతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పండించిన వంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేడే వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెకు వామపక్ష పార్టీలు, రైతు సంఘాలు మద్దతివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఏఈలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వేసవిని దృష్టిలో స్థానిక కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని చేతిపంపుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలన్నారు. మరమ్మత్తులకు గురైన చేతిపంపులు, మంచినీటి పథకాలకు వెంటనే బాగు చేయించాలన్నారు. చేతిపం పులకు అవసరమైన విడిభాగాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి వ్యక్తిగత మరుగ దొడ్డి ఉందో లేదో పరిశీలించాలన్నారు. లేనివారిని గుర్తించి మరుగుదొడ్డి నిర్మించుకునేలా చైతన్యపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ శ్రీనివాసరావు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడులో మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు సక్రమంగా హాజరు కాకపోవడంతో అజెండా ప్రకారం వచ్చినటువంటి అధికారులతో చర్చించి మొక్కుబడి తీర్చారు. మండల ఎంపీపీ గంగవరపు లక్ష్మిదేవి అధ్యక్షతన, ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ సమావేశం నిర్వహించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు మండలంలో ఉన్న పలు శాఖల అధికారులతో కలిసి మండలంలో జరుగు అభివృద్ధి పనులపై సమావేశం చర్చించారు. గతంలో పనిచేసిన చేయవలసిన పనులపై అధికారులు తెలియజేయగా గ్రామాలలో మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో సమావేశం చప్పగా సాగింది. ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్యం, టీచర్ల కొరత, రోడ్లు తదితర సమస్యల పై సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వచ్చిన పలు సూచనలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని మండల అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఏఎస్ పేటలో వేసవి విజ్ఞాన తరగతులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట గ్రంధాలయం శాఖా ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను మంగళవారం లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసులు హిందూ ప్రాథమిక పాఠశాల నందు నిర్వహించారు. ఈ విజ్ఞాన శిబిరంలో సుమారు 20 మంది విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొని గ్రంథాలయంలోని కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, జీవిత చరిత్రలు, తదితర పుస్తకములు పఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు మాట్లాడుతూ.. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ నెల ఆరో తేదీ వరకు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాణేల సేకరణ కర్త ఎండి.వాయిజ్ పాల్గొన్నారు.

# పిల్లలకు.. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ వివరించండి

## న్యాయమూర్తి వాణి పిలుపు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం సమాజంలో చిన్న పిల్లలను జాగ్రత్తగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద వసతి గృహాలలో సంరక్షకుల మీద ఉందని న్యాయమూర్తి కె.వాణి పేర్కొన్నారు. ముఖ్యంగా వసతి గృహాలలో బాల బాలికల సంరక్షణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని న్యాయమూర్తి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కే.వాణి మంగళవారం స్థానిక కొండాయపాలెం గేటు నందు ఉన్న వాత్సల్య అనాథ ఆశ్రమం, నెల్లూరు సింహపురి చిల్డ్రన్ హోంను సందర్శించారు. అలాగే అక్కడ పిల్లలకు భోజన వసతులు ఉండేందుకు బెడ్స్ బాత్రూమ్స్ అన్ని తనిఖీ చేసారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవాధికార సంస్థకు తెలుపాల్సిందిగా న్యాయమూర్తి వాణి సూచించారు. పిల్లలకు మంచి ఏదో చెడు ఏదో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని న్యాయమూర్తి తెలిపారు. ఏ టచ్ ఎలాంటిదో ఎవరిని దగ్గరగా రానివ్వకూడదు ఎవరు ఎక్కడ తాకకూడదు చెప్పడానికి కొంత మంది తల్లులు సంకోచి స్తున్నారని ఈ ధోరణి త్వరగా వీడి పిల్లలకు మంచేదో చెడేదో వివరించాలని తెలిపారు. సాక్షాత్తు న్యాయమూర్తి వాణి స్వయంగా పిల్లలకు భోజనం వడ్డించడం అక్కడి పిల్లలను ఆశ్చర్య పరిచింది. ఈ సందర్భంగా న్యాయమూర్తికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# దళిత మహిళను కామాక్షి నాయుడు బెదిరిస్తున్నారు..

## పందింటి సుబ్బయ్య మాదిగ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తన వాటా ధాన్యాన్ని అడిగితే ఇవ్వకుండా చంపి వేస్తానని నెల్లూరుకు చెందిన కామాక్షి నాయుడు బెదిరిస్తున్నాడని దీనిపై ఉన్నతాధికారులు బాధిత దళిత మహిళకు న్యాయం చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య మాదిగ కోరారు. నెల్లూరు నగరంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రాం భవన్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వెంకట రమణ రైస్ మిల్లులో నెల్లూరు బుజ్జమ్మ గుమస్తాగా పని చేస్తూ ఉన్నప్పుడు కామాక్షి నాయుడు పరిచయమయ్యారన్నారు. ఇద్దరు కలిసి కాపురం కూడా చేశారన్నారు. ఈ సమయంలో 300 పుట్లు ధాన్యాన్ని కొనుగోలు చేశారని అనంతరం వీరి మధ్య విభేదాలు రావడంతో నెల్లూరు బుజ్జమ్మను కొడుతూ వేధిస్తుండడంతో కేసు పెట్టడంతో ఇటీవల కామాక్షి నాయుడు జైలుకు కూడా వెళ్లారన్నారు. తనను జైలుకు పంపించారు అన్న కక్షతో నెల్లూరు బుజ్జమ్మ వాటాకు చెందిన 150 పుట్ల ధాన్యాన్ని ఇవ్వకుండా చంపేస్తామంటూ మళ్లీ బెదిరిస్తున్నారన్నారు. నెల్లూరు బుజ్జమ్మ మాట్లాడుతూ కామాక్షి నాయుడు ఆయన కుమారుడు బ్యాచిలు బ్యాచులుగా తన ఇంటి చుట్టూ తిరుగుతూ బెదిరింపులకు దిగారన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఐక్యవేదిక నేత విజయ్ కుమార్, రియాజ్, పద్మజ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన

# ఏ కిస్తీపురం చింతలపాలెం గ్రామస్తులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని ఏ కిస్తీపురం చింతలపాలెం గ్రామస్తులు ఆయా గ్రామాలలోని పలు సమస్యలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు మంగళవారం ఎమ్మెల్యే ఆయా గ్రామాల కమిటీలను ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు తమ గ్రామంలో ఉన్న భూ సమస్యలను, అలాగే సీసీ రోడ్ల ఏర్పాటు, త్రాగునీరు, విద్యుత్తు సరఫరా తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వారికి తెలిపారు. అనంతరం గ్రామ కమిటీలను మండల తెలుగుదేశం నాయకులు స్థానిక నాయకులతో కలిసి ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సీనియర్ నాయకులు వని పెంట వెంకటసుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, పొలిటికల్ మేనేజర్ స్థానిక గ్రామ నాయకులు దాట్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, దాట్ల రమేష్ రెడ్డి, లక్కు వెంకటేశ్వర్ రెడ్డి, దిద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి, కే.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించండి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మూజూర్ యూనియన్ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రెండోరోజైన మంగళవారం రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలాం, మౌలాలీ, నాగరాజు, మునీర్, సూర్యనారాయణ, ఆరీఫ్, బాష తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగరంలో వైసీపీలోకి వలసల జోరు

### 52వ డివిజన్‌లో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు వైసీపీలోకి చేరిక



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ ఆఫీసులో వైఎస్ఆర్సీపి మంగళవారం వైసీపీ 52 డివిజన్ ఇన్‌చార్జ్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 25 కుటుంబాలు కలిసి వైసీపీ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా తాము సేవలందిస్తామని వారు తెలిపారు. పార్టీకి అండగా సేవలందించిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తుపెట్టుకుని వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని చంద్రశేఖర్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికపై గ్రామసభ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని చిరమణ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ వార్షిక ప్రణాళిక పై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ పి.సుబ్బ రాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అగ్రికల్చర్ ఏవో విఏఏలు సచివాలయం సిబ్బంది వెలుగు సీసీలు వీవోఏలు ఓబీలు ప్రకృతి వ్యవసాయ ఏపీ సిఎన్ఎఫ్ఎన్‌పిఎం జిల్లా ఎంటి మాధవరావు డివిజన్‌ఎం టీ ఏవి లక్ష్మి మండల ఇన్‌చార్జ్ పి.సుబ్బరాయుడు మెంటర్స్ జి.సుబ్బమ్మ ఎల్ త్రీ లు రైతులు మహిళా సంఘాల రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు అలాగే బెస్ట్ ఫార్మర్స్ మాధవరావు ప్రసన్నకుమార్ రమేష్‌లకు శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పక్కాగృహాల లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టి వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ మోహన్ రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయగిరి మండలంలో 104మంది లబ్దిదారులకు ప్రభుత్వం అందజేసిన అదనపుసాయం అందజేసిందన్నారు. అందులో కేవలం 12మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంబించడం పట్ల నిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కొండాయపాళెం లేఅవుట్లో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభమవుతాయన్నారు. వారికి సైతం ప్రభుత్వం రూ.50 వేలు అదనపు సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ పీరా, ఏఈ రామకృష్ణ వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధనరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వేసవి విజ్ఞానశిబిరం అత్యంత ప్రయోజనం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను మంగళవారం స్థానిక లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో విశ్రాంత గ్రంధ భాండాగారి అంకినపల్లి గోవిదంరెడ్డి ప్రారంభిం చారు. ప్రతిఏటా క్రమం తప్పకుండా వేసవి సెలవుల్లో లైబ్రేరియన్ శ్రీనివాసరాజు వేసవివిజ్ఞన తరగతులను నిర్వహించడం, ఆటపాటలతో, పుస్తకపఠనంతో, వివిధ ప్రదర్శనలతో, పలువురు ప్రముఖులను రప్పించి సందేశాలు, కథలు గేయాలు విన్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈదపా కూడా వేసవి విజ్ఞాన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథి గోవిందరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు ఈ ఎండల్లో ఎక్కడా బయట తిరగకుండా లైబ్రరీలో వేసవివిజ్ఞానశిబిరానికి హాజరైతే ఎంతో ప్రయోజ నకరమని, తగిన విజ్ఞానం పొందుతారని, రాను న్న విద్యాసంవత్సర చదువులకు పునాదులు ఏర్ప డతాయన్నారు. మంచి పుస్తకాలను చదివించడం ద్వారా, వివిధ కథలు వినడం ద్వారా వారి మేధ స్సు పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. లైబ్రేరియన్ శ్రీనివాసరాజు ప్రసంగిస్తూ వేసవిలో విద్యార్థులకు లైబ్రరిలో నిర్వహించే శిబిరం ఇటు విజ్ఞనం పెంపొందడం, అటు రక్షణగా ఉంటాయ ని పేర్కొన్నారు. అందుకే తమవంతుగా ప్రతిఏటా వేసవివిజ్ఞానశిబిరాన్ని నిర్వహిస్తుంటామని, ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు కూడా నిర్వహించి వారి విజ్ఞానాన్ని ఇనుమడింపజేసే ప్రయత్నం సాగిస్తుంటామని, క్రమం తప్పకుండా ఈ శిబారాన్ని నిర్వహిస్తున్నామని శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులచేత పలు కథలపుస్తకాలను చదివించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరాజు, గోవిందరెడ్డిలు కోరారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీవరకు కొనసాగిస్తామని లైబ్రేరియన్ పేర్కొన్నారు.

# అభ్యంతరం లేని ఆక్రమణ స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు



## కమిషనర్ వై.ఓ నందన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం జీ.వో.ఎంఎస్. నం.30 తేదీ 29.01.2025 రెవెన్యూ ల్యాండ్స్ యాక్ట్ ప్రకా రంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూములలో తేదీ. 15.10.2019 నాటి వరకు నిర్మించి యున్న అభ్యంతరం లేని ఆక్రమ ణలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు కమిషనర్ వై.ఓ నందన్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరిపి గృహ నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న వారు, ఎలాంటి ఆధీకృత ధృవీకరణ పత్రాలు లేనందున తొలగింపు బెదిరింపులకు ఎప్పటికప్పుడు గురవు తున్నారని తెలిపారు. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల అభ్యర్థుల మేరకు అభ్యంతరాలు లేని అలాంటి నివాసాలను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలియ జేశారు. క్రమబద్ధీకరణ పథకం ద్వారా అభ్యంతరం లేని నివాసాల క్రమబద్ధీకరణ దరఖాస్తులు చేసుకోవడం, సంబంధించిన చలా నాలు చెల్లించడం, ఆధీకృతంగా హక్కులను పొందడం వంటి చర్యలను ప్రభుత్వం కల్పిస్తుం దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన గ్రామ వర్గీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలంతా అన్యాక్రాంతమైన నివాస హక్కులను పొందాలని కమిషనర్ సూచించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లో నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలంతా స్వచ్ఛందంగా సహకరించి పథకం అమలుకు తోడ్పడాలని కమిషనర్ సూచించారు.

# ఎన్‌సీసీ మూడవ వార్షిక శిక్షణా శిబిరం







**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, క్యాంపు కమాండెంట్ గణేష్ గౌదంగవే ఆధ్వర్యంలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-3, 28 ఏప్రిల్ 2025 నుంచి 07 మే 2025 వరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం అక్షర విద్యాలయ నందు నిర్వహింపబడుతుంది. ఈ క్యాంపును ఉద్దేశించి క్యాంపు కమాండెంట్ గణేష్ గౌదం గవే మాట్లాడుతూ.. కేడేట్లు ఈ శిక్షణా శిభిరంలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సామాజిక సేవ, దేశ భక్తి, గన్ ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ శిక్షణను మంచిగా ఉపయోగించుకుని అత్యు త్తమ పౌరులుగా ఎదిగి దేశ సేవ చేయాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత మంచినీరు తాగాలని క్యాడేట్లకు ఉద్భోదించారు. ఈ క్యాంపులో మంగళవారం శారీరక వ్యాయామం, యోగ ఆసనాలు, నౌక నమూనా నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలు, సమాచార వ్యవస్థ, ఆయుధ శిక్షణ, ఆరోగ్యము మరియు పరిశుభ్రత లెక్చరర్, ఎన్సిసి గురించి అవగాహన ఉపన్యాసం, ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్సిసి అధికారులు గుండాల నరేంద్ర బాబు, మల్లికార్జున రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, సాయి శంకరి, పి ఐ స్టాఫ్ వైకుంఠం చీఫ్ ఇన్స్ట్రక్టర్, పెట్టీ ఆఫీసర్లు రంజన్, లోకేష్, లక్ష్మణ్, దీపక్,వెంకటేష్, రమణారావు, నవీన్, ఆఫీస్ సిబ్బంది సూపరింటెండెంట్ ముకుంద సాగర్, షిప్ మోడలింగ్ ఇన్స్ట్రక్టర్ రామన్ సీనియర్ అసిస్టెంట్లు షెహనాజ్ బేగం, కల్పన, జూనియర్ అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణా శిభిరంలో మొత్తం 565 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరై శిక్షణ పొందుతున్నారు.




# రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రాలకు సంబంధించిన అన్నిరకాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని సీడీపీవో సునీత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రా ల నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటిం చాలన్నారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గర్భవతులు, బాలింతలు. చిన్నారులు వడదెబ్బకు గురి కాకుండా తగు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. అర్హులైన విద్యార్థులను కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

# పది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మడలంలో పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థుల సౌకర్యార్థం సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్వలి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. మండలంలోని గడిపాళెం, ఉదయగిరి, గడ్డంవారిపల్లి, బిజ్జంపల్లి క్లస్టర్ కేంద్రాల్లో విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు శిక్షణ తరగతులను నిర్వహిసా రన్నారు. ప్రధానంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఫెయిల్ అయిన విద్యార్థు లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# జిల్లాల అధ్యక్షుల సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లాల అధ్యక్షులు సమావేశం మంగళవారం జరిగింది. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా నుంచి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి జిల్లాల అధ్యక్షులతో మాట్లాడి ఆయా జిల్లాల్లో ప్రజల ఇబ్బందులను, రాజకీయ పరిస్థితులను, పార్టీ స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాల అధ్యక్షులకు సూచించారు. అలాగే ప్రతి విషయంలో ప్రజలకు అండగా నిలబడి త్వరితగతిన నిర్ణయాలు తీసుకొని ప్రజా సమస్యలపై ముందుండి పోరాటం చేయాలని సూచించారు. జిల్లాలో పార్టీ అధ్యక్షులే కీలకమని పార్టీని గ్రామస్థాయి వరకు బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లాల్లో పార్టీ గెలుపు బాధ్యత కూడా జిల్లా అధ్యక్షులదే అన్నారు. పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, చేపట్టి కార్యకర్తలకు మెరుగైన భీమా వర్తించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డిని కలిసిన మెట్టుకూరి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అధ్యక్షులుగా నియమి తులైన మెట్టుకూరి ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మెట్టుకూరికి శు భాకాంక్షలు తెలియజేశారు.

# తహశిల్దారు కార్యాలయభవన నిర్మాణం పూర్తయ్యేదెన్నటికో..






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనేక భవనాలు నిర్మాణంలో అర్ధాంతరంగా నిలిచిపోవడం, వాటిని గురించి పట్టించుకొనకపోతుండడం పరిపాటిగా ఉండగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల రెవిన్యూకార్యాలయ భవనం దశాబ్ధం దాటినా నిర్మాణం పూర్తికాకుండా దర్శనమిస్తుండడం గమనార్హం. ఒకటికాదు, రెండు కాదు ఏకంగా 12సంవత్సరాల క్రితం శంఖుస్థాపన గావించబడి పనులు ప్రారంభమై శ్లాబ్‌లెవల్‌కు చేరగా ఈనాటికీ పూర్తికాకుండా అదేపరిస్థితి కొనసాగుతోంది. ప్రస్థుతం తహశిల్దారు కార్యాలయం కొనసాగుతున్న బ్రిటిష్‌కాలంనాటి భవనం శిధిలావస్థకు చేరుకోగా వర్షాలకు ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతోపాటు రికార్డులు తడిచిపోతాయనే ఆందోళనతో కొనసాగుతున్నారు. భవన పైకప్పుకు తార్పాలిన్ పట్టలు కప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆత్మకూరు శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తూ దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రోడ్లు, భవనాలు, సంస్థలు, వంతెనలు తదితరాలను సాధించారు. అందులోభాగంగా ఆత్మకూరు మండల రెవిన్యూకార్యాలయ ఆవరణలో తహశిల్దారు కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, సబ్‌ట్రెజరీ భవనాల నిర్మాణాలకు 3కోట్ల రూపాయలను ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేయించి అప్పటి రెవిన్యూ మంత్రి ఎన్.రఘువీరారెడ్డిని రప్పించి శంఖుస్థాపనలు గావించారు. కాగా ట్రెజరీ కార్యాలయం తమ శాఖనిధులు సాధించుకొని భవనం నిర్మించుకొని శిధిలమైన భవనం నుండి నూతన భవనంలోకి మారారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణం నిలిచిపోయిఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి కలెక్టర్ చొరవతీసుకొని పనులు పూర్తిచేయించి ప్రారంభోత్సవం గావించి ఆర్డీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి తరలించారు. ఇక తహశిల్దారు కార్యాలయ భవనం మాత్రం అలాగే శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. అయితే ఈ ఈదపా మళ్ళీ ఆత్మకూరు శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతుండడం జరగ్గా ఆయన ఈ భవనాన్ని పరిశీలించి తాను ఆనాడు మంజూరుచేయించి ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని పేర్కొంటూ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంకా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందిపడుతూ ఆందోళన చెందుతున్న పరిస్థితిని గమనించి ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేయాలని, రామనారాయణరెడ్డి ఎంతో శ్రద్ధతో నిధులు సాధించిన భవనాన్ని పూర్తిచేసి ఆయన సంకల్పానికి సార్ధకత చేకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

## సైదాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని రాగన రామాపురం పంచాయతీలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంకు తూట్లు పొడిచారని కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో ఇందుకు సంబంధించి మంగళవారం ఏపీడీ గాయత్రీ దేవి, జిల్లా విజిలెన్స్ అధికారి డి.విజయలక్ష్మి, సైదాపురం ఎంపీడీవో ఫిర్యాదుదారులను, పనిచేసిన వేతన దారులను విచారించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి మాధవి లత, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుకూరు పదవిపట్ల ఆత్మకూరులో సంబరాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెట్టుకూరు ధనుంజయరెడ్డి జిల్లాకేంద్ర సహకారబ్యాంక్ చైర్మెన్‌గా నియమితులైన సందర్భంగా మంగళవారం రాత్రి ఆత్మకూరు పట్టణంలోని జే.ఆర్.పేటలో శ్రీ వినాయకమండప కమిటీ వారు ఘనంగా ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ధనుంజయరెడ్డి సేవానిరతి, ఉదారస్వభావం, దానగుణం కలిగిన నాయకుడుగా తమకు అత్యంత సన్నిహితులని, ఆయనకు పదవి రావడం అత్యంత సంతోషదాయకమని కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండపంవద్ద వారు కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టి బాణాసంచాకాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేసి ధనుంజయరెడ్డికి అభినందనలు తెలిపారు. ధనుంజయరెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండపకమిటీ చైర్మెన్ కేతా మస్తాన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, షేక్ మహబూబ్‌బాషా, బిఎల్‌ఏ కాపా వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు భోగిరెడ్డి విజయభాస్కరరెడ్డి, కిన్నెర నరశింహరావు, జమ్మల సుబ్బారెడ్డి, సాయిబాబా(రిటైర్ట్‌బ్యాంకు ఉద్యోగి), భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు దక్కిన జిల్లా సహకారబ్యాంక్ పదవి

- చైర్మెన్‌గా మెట్టుకూరుకు రెండవదపాఛాన్స్
- నామినేటెడ్ పదవులకు బోణీ
- సత్తాచాటిని మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రసహకారబ్యాంక్ చైర్మెన్ పదవి ఎట్టకేలకు ఆత్మకూరు నియోజకవర్గానికి దక్కింది. గతంలో ఇదే పదవిని ఐదేళ్ళపాటు నిర్వహించిన మెట్టుకూరు ధనుంజయరెడ్డికి రెండవదపా ఛాన్స్ లభించింది. ఈపదవి ఇతర నియోజకవర్గాల వారు ఆశిస్తున్నారని, అక్కడి ప్రజాప్రతినిధులు తీవ్రంగా యత్నిస్తున్నరన్న ప్రచారం ఇటీవల ముమ్మరంగా సాగగా ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ప్రత్యేక పట్టుదలతో మెట్టుకూరు ధనుంజయరెడ్డికి ఇప్పించుకొని తన సత్తాచాటారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన ధనుంజయరెడ్డి ఒకటిన్నర దశాబ్ధకాలంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. ఆయన మొదటినుండి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడుగా, అత్యంత సన్నిహితుడుగా ఉంటున్నారు. ఆయన గతంలో జిల్లా కేంద్రసహకార బ్యాంక్ చైర్మెన్‌గా ఐదేళ్ళపాటు వ్యవహరించారు. ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో అనుచర, బంధుగణం అధికంగా ఉన్న ధనుంజయరెడ్డి గతంలో తెలుగుదేశంలో, వైసిపిలో ఎమ్మెల్యే టిక్కెట్ కూడా ఆశించారు. వివిద నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా, పరిశీలకులుగా కూడా వ్యవహరించారు. గత ఏడాది జరిగిన ఎన్నికల సందర్భంగా ధనుంజయరెడ్డి ఆనం చెంతకు చేరుకొని ఆయన విజయం కోసం అహర్నిశలు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారు. వివాదరహితుడుగా, సౌమ్యుడుగా, నాయకత్వపటిమగల నాయకుడుగా ఉన్న ధనుంజయరెడ్డికి ఈదపా డిసిసిబి చైర్మెన్ పదవి లబిస్తుందా, లేదా ఏదేని కార్పోరేషన్ పదవి వరిస్తుందా అని పలువురు చర్చించకుంటుండేవారు. డిసిసిబి ఇతర నియోజకవర్గానికి వెళుతుందన్న ప్రచారం సాగగా ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఉన్న మంచి పరపతితో తన అనుచరుడైన ధనుంజయరెడ్డికే డిసిసిబి చైర్మెన్ పదవి దక్కేలా యత్నించి తన సీనియారిటీ, సమర్ధత, సత్తాచాటుకున్నారు. గతంలో మెట్టుకూరు డిసిసిబి చైర్మెన్‌గా వ్యవహరించిన సమయంలో బ్యాంకును బాగా అభివృద్ధి చేయడం, లాభాలబాటపట్టించడం, జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకారసంఘాలకు ఇతోధికంగా రుణాలందించి రైతులకు అత్యంత ప్రయోజనం కల్పించడంతోపాటు సొసైటీలను బలోపేతం చేశారు. ధనుంజయరెడ్డి గతంలో డిసిసిబి చైర్మెన్‌గా వ్యవహరించిన అనుభవంతోపాటు రామనారాయణరెడ్డి మంత్రిగా ఉండడంతో ఈదపా మరింతగా బ్యాంకును అభివృద్ధిపరుస్తారని, రైతులకు మరింతగా సేవలందిస్తారని, సొసైటీలను మరింతగా పటిష్టం చేయగలరని సర్వత్రా భావిస్తున్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 3విడతలుగా నామినేటెడ్ పదవులు ఇచ్చినా ఆత్మకూరు నియోజకవర్గాన్ని ఏపదవి తాకలేదని సర్వత్రా భావిస్తున్న తరుణంలో ధనుంజయరెడ్డి ప్రోటోకాల్ ఉన్న డీసీసీబీ చైర్మెన్ పదవిని దక్కించుకొని నియోజకవర్గంలో నామినేటెడ్‌పదవులకు బోణీకొట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ధనుంజయరెడ్డికి ఈపదవి రావడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియోజకవర్గాన్ని గతంలో అనూహ్యంగా అభివృద్ధిపరిచి అభివృద్ధిప్రదాతగా పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి ఈదపా మళ్ళీ ఆత్మకూరుకు మహర్ధశ కల్పించేలా అనేక ప్రణాళికలతో ముందుకుసాగుతూ ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సాధించగా ఆయన నేతృత్వంతో ధనుంజయరెడ్డి కూడా తమవంతుగా ఆయన అనుచరుడుగా ప్రజలకు సేవలందించగలరని, జిల్లా వ్యాప్తంగా రైతులకు సాయమందించగలరని సర్వత్రా భావిస్తున్నారు.



# జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ షెడ్యూల్ ఇదే

- అఖిల భారత అంతర యూనివర్శిటీల సాఫ్ట్ బాల్ టోర్నమెంట్
- ఏప్రిల్ 30 నుండి మే 3వరకు మహిళల టోర్నమెంట్
- నాలుగు పూల్స్‌లో మొత్తం 95 జట్లు పోటీ
- నాక్ అవుట్ దశలో మొత్తం 91 మ్యాచ్‌లు
- మొదటి రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభ వేడుక
- ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న పలువురు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్శిటీలో వర్శిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న అఖిల భారత అంతర యూనివర్శిటీల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. మొదటి రోజున ఉదయం 6.30 గంటల నుండే క్రీడా పోటీలు ప్రారంభం కానుండగా ప్రారంభ వేడుక సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ప్రారంభ వేడుకలో ముఖ్యఅతిథిలుగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. ఏప్రిల్ 30 నుండి మే 3వ తేది వరకు జరగనున్న మహిళల టోర్నమెంట్ కు సంబంధించి మొత్తం 95 జట్లు పోటీ పడనున్నారు. నాక్ అవుట్ దశలో పూల్ ఎ, బి, సి, డి ఇలా నాలుగు పూల్స్ లో మొత్తం 91 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ దశలో ఏదైనా టీమ్ ఒక్క మ్యాచ్ ఓడినా టోర్నీ నుండి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఈ నాలుగు పూల్స్‌లో నుండి చివరకి ఒక్కో టీమ్ లీగ్ దశకు చేరుకుంటాయి. లీగ్ దశలో మిగిలిన నాలుగు టీమ్ లు, ఒక్కో టీమ్ మిగిలిన మూడు టీమ్ లతో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ దశలో ఎక్కువ మ్యాచ్‌లు గెలిచి అధిక పాయింట్లు సాధించిన టీమ్‌ను విజేతగా ప్రకటిస్తారు. మొదటి రోజున పూల్ ఏ లో మొదటి మ్యాచ్‌లో తెలంగాణ యూనివర్శిటీ, స్వర్ణజిత్ గుజరాత్ స్పోర్ట్స్ యూనివర్శిటీ జట్లు తలపడనున్నారు. తదుపరి మ్యాచ్‌లో ఒడిశాలోని శిక్షా ఓ అనుసంధాన్ యూనివర్శిటీ జట్టుతో భోపాల్‌లోని బర్కతుల్లా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ బీ లో మొదటి మ్యాచ్‌లో హైదరాబాద్ జేఎన్టీయూ జట్టుతో ఆగ్రాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్‌లో నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్శిటీ జట్టుతో చెన్నైలోని అన్నా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ సి లో మొదటి మ్యాచ్‌లో అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్శిటీ జట్టుతో హైదరాబాద్‌లోని వీసీఐ మహిళా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్‌లో కన్నూరు యూనివర్శిటీ జట్టుతో కేరళ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ డి లో మొదటి మ్యాచ్‌లో ముంబై యూనివర్శిటీ జట్టుతో కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్‌లో నాందేడ్ లోని స్వామి రామానంద తీర్థ మరత్వాడ యూనివర్శిటీ జట్టుతో బికనీర్‌లోని మహారాజ గంగాసింగ్ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం జాతీయ స్థాయిలో సాఫ్ట్ బాల్‌లో పేరొందిన 40 మంది అంపైర్ లను, రెఫరీలను యూనివర్శిటీ వారు రప్పించారు. పోటీలు సజావుగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. యూనివర్శిటీ ఆధ్వర్యంలో మొత్తం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో 15 కమిటీలను నియమించి క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్శిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులతో, పోలీసు అధికారులతో, విద్యుత్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ త్రాగు నీటికి, విద్యుత్తుకి, భద్రతకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.


# వీధి కుక్కల నియంత్రణకు నిర్దిష్ట చర్యలు తీసుకోండి

### కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలకసంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకొని, శస్త్ర చికిత్సల కాలంలో వాటికి అవసరమైన ఆహారం, మందులను అందించి వేగవంతంగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 5వ డివిజన్ వైకుంఠపురం, సత్యనారాయణ పురం, నేత నగర్, అహ్మద్ నగర్, అరవపాలెం, స్థానిక 6వ డివిజన్ స్టోన్ హౌస్ పేట, చెన్నూరు వారి వీధి, సాలె వీధి తదితర ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఏబీసీ కేంద్రం ద్వారా వీధి కుక్కల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వాక్సినేషన్ తప్పనిసరిగా ఇప్పించాలని సూచించారు. శస్త్ర చికిత్స సమయంలో తగిన మోతాదులో ఆహారం అందించి సంరక్షించాలని, అవసరమైన వైద్య సదుపాయాలు, మందులను తప్పనిసరిగా ఇప్పించి ఆరోగ్యవంతంగా తిరిగి కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. స్థానిక బోడిగాడి తోట, అహ్మద్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ వ్యాప్తంగా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా సిబ్బంది చేపట్టేలా పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. స్థానికంగా నిర్మిస్తున్న నూతన అపార్ట్మెంట్‌ను కమిషనర్ పరిశీలించి, బిల్డింగ్ ప్లాన్ అనుమతులను తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదును కమిషనర్ పరిశీలించి తగిన పరిష్కారం చూపించాల్సిందిగా రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఇంజనీరింగ్ విభాగం డీఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఖరారు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మే 1వ తేదిన జిల్లాలోని ఆత్మకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అధికారికంగా ఖరారు అయ్యిందని డీపీఆర్ఓ కార్యాలయం అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11:30కు ఆత్మకూరు లోని బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం 11:50కు నెల్లూరుపాలెంకు చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 12:10 నుండి 12:30 వరకు నెల్లూరుపాలెం గ్రామం లోని బిల్డింగ్ వర్కర్స్ తో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం 12:35 కు నారంపేట ఏపీఐఐసీకు చేరుకుని ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 1:30 నుండి 3:00 వరకు ప్రజావేదికలో స్థానికులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం 3:05కు టిడ్కోగ్రౌండ్‌కు చేరుకుని 4:35 వరకు పార్టీ క్యాడర్ తో మాట్లాడిన అనంతరం 4:40 కు హెలిప్యాడ్‌కు చేరుకుని 5:45కు ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారని డీపీఆర్ఓ కార్యాలయం అధికారులు తెలిపారు.

## పారదర్శకంగా రీసర్వే ప్రక్రియ చేపట్టాలి

- రీసర్వే వర్క్ షాప్‌లో ఆర్డీవో అనూష



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రీ సర్వే పారదర్శకంగా చేయాలని నెల్లూరు ఆర్డీవో అనూష ఆదేశించారు. రీసర్వే విషయమై కలెక్టరేట్లో ఆర్డీవో అధ్యక్షతన రీసర్వే వర్క్ షాపు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రీసర్వే నందు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, రీసర్వే ఉపతహాశీల్దార్లు, తహాశీల్దార్లు చేయవలసిన విధి విధానాలు, నాణ్యత తప్పకుండా రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చేయవలసినదిగా సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చిన టైమ్ లైన్స్, ఎస్ఒపి ప్రకారం సర్వే నిర్వహించి పైలెట్ గ్రామాలు, రెండవ ఫేస్ గ్రామాలు పూర్తి చ్చేలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు కుమారి నాగఅనూష, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురామ రాజు, డిప్యూటీ ఇన్స్పెక్టర్స్, తహాశీల్దార్లు, రీసర్వే ఉపతహాశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ, సర్వేయర్లు హాజరైయ్యారు.

## నేడు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం : సీఈఓ విద్యారమ



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని జడ్పీ సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ, జిల్లా ప్రజా పరిషత్, మండల పరిషత్ 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సరపు అంచనా బడ్జెట్, అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అధికారక వ్యవహారాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. కావున జిల్లా ప్రజా పరిషత్ సభ్యులందరూ, జిల్లాస్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

## చంద్రప్రభ వాహనంపై భగవద్రామానుజాచార్యులు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం, రంగనాయకులపేట, నెల్లూరు నందు మంగళవారం శ్రీ భగవద్రామానుజాచార్యుల 1008వ అవతారోత్సవాలు సందర్భంగా మంగళవారం ఉదయం తిరుమంజనం జరిగింది. సాయంత్రం మంగళశాసనోత్సవం తదుపరి చంద్రప్రభ పేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా తి.న.చ.నరసింహాచార్యులు (సింహాద్రి స్వామీ) వారసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంకు ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో గండిపాళెం, ఉదయగిరి, శకునాలపల్లి పంచాయతీల్లో చలివేంద్రాలు ప్రారంభించామన్నారు. మిగిలిన పంచాయతీల్లో సైతం త్వరితగతిన ప్రారంభించాలన్నారు. పంచాయతీలకు సంబంధించిన పన్నులు సకాలంలో వసూలు చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ నన్ను అనే యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి తన ప్రతినిధులచే రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.